## క్లుప్తంగా

### విజేతలకు బహుమతులు అందజేత



**డిచ్‌పల్లి:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పీవోడబ్ల్యూ, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో గురువారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో ముగ్గులు, కుర్చీలాట, బీడీలు చుట్టడం లాంటి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వెంకన్న, మురళి, కిషన్, శ్రీనివాస్, గంగాధర్, మోహన్, లలిత, వీడీసీ సభ్యులు గంగాధర్, సుదర్శన్, తిరుపతి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విలీన సభను విజయవంతం చేయాలి



**డిచ్‌పల్లి:** ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 18న కొత్తగూడెంలో నిర్వహించే రెండు యూనియన్ల విలీన సభను విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి జేపీ గంగాధర్ కోరారు. ఈ మేరకు గురువారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం బీడీ కార్మికులకు చేయూత పథకం కింద రూ.4,016లు ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు యాదమ్మ, గంగమ్మ, జె స్వప్న, లలిత, సరళ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం



**నిజామాబాద్ అర్బన్:** బీఆర్ఎస్ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని బీ ఆర్ ఎస్ యువజన విభాగం నాయకులు అభిలాష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్మూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని దీనిని ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేయడం తగదని అన్నారు. సమావేశంలో యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

### వాలీబాల్ కిట్ అందజేత




**డిచ్‌పల్లి:** జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి గురువారం మండలంలోని డిచ్‌పల్లి తండాకు చెందిన రాథోడ్ యూత్ సభ్యులకు వాలీబాల్, నెట్ కిట్‌ను అందజేశారు. యువత క్రీడలపై ఆసక్తి కనబర్చాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గాదరి సంజీవ్ రెడ్డి, గద్దర్, గణేశ్, నితిన్, అనిల్, సిద్ధు, దినేశ్, సందీప్, అర్జున్, గణేశ్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### 18న స్వర్ణసౌరభం సంగీత విభావరి

**నిజామాబాద్ రూరల్:** స్వర్ణ సౌరభం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆర్యనగర్‌లో ఉన్న బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు నాగరాజుశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు, హిందీ మధుర గీతాలను ప్రముఖ గాయనీ గాయకులు ఆలపిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



**జక్రాన్‌పల్లి:** జిల్లా పెరిక సంఘం క్యాలెండర్‌ను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్, శంకర్, మైదం రాజన్న, బుద్దె సుదర్శన్, లక్కర్సు శివ, బాడ్సి పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# వార్డు కమిటీలు లేవు..!

- నిజామాబాద్‌లో 60 డివిజన్లు
- డివిజన్‌కో కమిటీ ఉండాలి
- సంక్షేమ పథకాలకు కమిటీ తీర్మానం తప్పనిసరి
- ఈనెల 21 నుంచి వార్డు సభల నిర్వహణ



ముని్సపల్ కార్యాలయం

**నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. ఇప్పటి వరకు పలు పథకాలు విజయవంతంగా అమలుచేసింది. మిగిలిన పథకాలు సైతం అమలు చేసేందుకు విధి విధానాలు రూపొందించింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రతాకార్డు(డిజిటల్ కార్డు) వంటి పలు పథకాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు చేస్తోంది. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండేందుకు గ్రామ, వార్డు, డివిజన్ కమిటీ సభలు నిర్వహించాలని ఆదేశించింది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ కమిటీల ద్వారా సమావేశం నిర్వహించాలని సూచించింది.

**నాలుగేళ్ల క్రితమే..**

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు ఉన్నాయి. ప్రతి డివిజన్‌కు ఒక కమిటీ చొప్పున 60 డివిజన్ కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఇందూరులో ఇప్పటి వరకు ఒక్క డివిజన్ కమిటీ కూడా వేయలేదు. నాలుగేళ్ల క్రితమే ఈ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా కాలేదు.

**సభలు నిర్వహించి..**

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు డివిజన్ కమిటీల తీర్మానం చేయాలని ఆదేశించింది. గ్రామీణ స్థాయిలో గ్రామ సభలు, కార్పొరేషన్‌లో వార్డు, డివిజన్ కమిటీ సభలు నిర్వహించాలి. సభలు నిర్వహించి తీర్మానాలు చేయాలని సూచించింది. ఇటీవల కలెక్టర్ సైతం గ్రామ, వార్డు కమిటీ సభలు పక్కాగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈనెల 21 నుంచి 24 వరకు సభలు నిర్వహించాలని సూచించారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ పథకాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

**కార్పొరేటర్లకే సమాచారం లేదు**

ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటు జిల్లా మొత్తం పూర్తయినా బల్దియాలో మాత్రం కొనసాగడం లేదు. లబ్ధిదారుల ఎంపికను గత కమిషనర్ మకరందు యత్నించినా ఫలించలేదు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేను ఈ ఎంపికలు చేస్తున్నారు. వారిదే తుది నిర్ణయం. ఆయా ఎమ్మెల్యేలు కమిటీలు వేసి కలెక్టర్‌కు పంపారు.

**27తో ముగియనున్న పదవీ కాలం**

మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల పదవీకాలం ఈనెల 27తో ముగియనుంది. ఈ నెల 18న మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చివరి కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. తర్వాత వీడ్కోలు సమావేశానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**సజావుగా జరిగేనా..?**

ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా వార్డు, డివిజన్ కమిటీలు వేయడం సాధ్యపడేలా లేదు. ఒకవేళ తూతూ మంత్రంగా వేసినా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకత సాధ్యం కాదు. ఈ నెల 21 నుంచి 25 వరకు వార్డు సమావేశాలు నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ అధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారోనని కార్పొరేటర్లు ఎదురుచూస్తున్నారు.

### డివిజన్ కమిటీలు

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి డివిజన్‌కు ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. ఆయా డివిజన్ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు ఇద్దరు, డివిజన్‌లోని రిటైర్డు ఉద్యోగులు, ప్రముఖులు, యువజన సంఘాల నాయకులు, ఇతర సభ్యులతో కూడిన కమిటీని వేయాలి. ఈ కమిటీ ప్రతి నెలా సమావేశం నిర్వహించి ఆయా డివిజన్‌లోని సమస్యలను చర్చించాలి. వాటి పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్వహించే సర్వేలు వంటి వాటికి సంబంధించి అధికారులకు సహకరించాల్సి ఉంటుంది.

### అర్హుల నిర్ధారణ కోసం..

ఆయా డివిజన్ల పరిధిలో అర్హులైన వారిని నిర్ధారించేందుకు ఈ డివిజన్, వార్డు కమిటీలే కీలకం కానున్నాయి. అయితే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు డివిజన్ కమిటీలు వేయలేదు. ప్రభుత్వం సూచించిన సమయం దగ్గరపడుతోంది. కార్పొరేటర్ల పదవీ కాలం ఈనెల 27తో ముగియనుంది. దీంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా సాగడం కష్టమే.

రైతు భరోసా పథకం కింద పట్టాపాసు పుస్తకం ఉన్న రైతుకు ఎకరాకు రూ.12వేల పెట్టుబడి సహాయం అందించనుంది. సాగుభూమిలేని రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12వేలు ఇవ్వనుంది. కొత్త రేషన్ కార్డుల జారీ, డిజిటల్ ఫ్యామిలీ కార్డు కోసం ఈ కమిటీలే నిర్ణయించాల్సి ఉంటుంది.

### వార్డు కమిటీలు వేయాలి



బల్దియా పరిధిలో వెంటనే వార్డు కమిటీలు వేయాలి. ఈ కమిటీలు నాలుగేళ్ల క్రితమే వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు వేయలేదు. ఒక్క వార్డులో కూడా సమావేశం నిర్వహించలేదు. ఇకనైనా కమిషనర్ కమిటీని వేయించాలి.

– న్యాలం రాజు, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్

### వార్డు కమిటీలు వేస్తాం



ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపికకు వార్డు కమిటీల సభలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు వార్డు కమిటీలు వేయలేదు. త్వరలోనే కమిటీలు వేసి సమావేశాలు నిర్వహిస్తాం.

– ఎస్ దిలీప్‌కుమార్, కమిషనర్

# సర్వే సక్రమంగా నిర్వహించాలి



డిచ్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



మోపాల్‌లో..

- అదనపు కలెక్టర్ అంకిత్
- సర్వేను పరిశీలించిన అధికారులు

**డిచ్‌పల్లి:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి చేపట్టిన సర్వేను సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లిలో చేపట్టిన సర్వేను పరిశీలించారు. సర్వేలో సేకరించిన వివరాలను తప్పులు లేకుండా నమోదు చేస్తే డేటా ఎంట్రీలో పొరపాట్లకు అవకాశం ఉండదన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ వివరాలను సేకరించాలన్నారు. నాలా కన్వర్షన్, భూసేకరణ, లేఅవుట్, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను సర్వే నంబర్ల వారిగా పరిశీలించి భూభారతి(ధరణి) పోర్టల్, గూగుల్ మ్యాప్ ఆధారంగా వాస్తవ వివరాలను నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భూములను క్షేత్రస్థాయిలో గుర్తించి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ ప్రభాకర్, ఏవో సుధామాధురి, ఆర్‌ఐ సంతోష్, సర్వేయర్ సతీశ్, సీనియర్ అసిస్టెంట్ షబ్బీర్, ఏఈవోలు వంశీ, సతీశ్, పంచాయతీ కార్యదర్శి వినయ్ తదితరులు ఉన్నారు.

**మోపాల్, రూరల్ మండలాల్లో..**

**నిజామాబాద్ రూరల్:** మోపాల్, రూరల్ మండలాల్లో అధికారులు రేషన్‌కార్డుల కోసం సర్వే చేపట్టారు. మోపాల్ మండలంలో 908 దరఖాస్తులకు 428 దరఖాస్తులను వెరిఫికేషన్ పూర్తి చేశారు. రూరల్ మండలంలోని 601కి 285 వెరిఫికేషన్ పూర్తి అయినట్లు ఎంపీడీవో రామ్‌నారాయణ పేర్కొన్నారు. రేషన్‌కార్డుల పరిశీలనను జెడ్పీ డిప్యూటీ సీఈవో సాయన్న గుండారంలో జరుగుతున్న తెల్లరేషన్‌కార్డుల సర్వేను పరిశీలించారు. సర్వేలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పరిశీలించాలని సూచించారు.

**ఇందల్వాయిలో..**

**ఇందల్వాయి:** మండలంలోని నల్లవెల్లి, ఇందల్వాయి, లోలం గ్రామాల్లో అధికారులు గురువారం సర్వే చేపట్టారు. గృహ నివాసాలు, కోళ్ల ఫారాలు, పట్టా ఉండి పంటలు సాగుకాని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూడు గ్రామాల్లో సుమారు 60 ఎకరాల భూమిని సాగుయోగ్యం కానిదిగా గుర్తించినట్లు ఏవో శ్రీకాంత్ తెలిపారు. పరిశీలనలో తహసీల్దార్ వెంకట్‌రావు, ఆర్‌ఐ మోహన్, ఏఈవోలు రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



గుండారంలో..



నల్లవెల్లిలో..

# గ్రామీణ శాస్త్రవేత్తలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న తాటి భూమయ్య

**నిజామాబాద్ నాగారం:** గ్రామీణ శాస్త్రవేత్తలను ప్రోత్సహించాలని శాస్త్రవేత్త తాటి భూమయ్య చారి అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 29 ఏళ్ల నుంచి ఎన్నో పరిశోధనలు చేసి 52 ఇన్నోవేషన్స్ చేశానని, ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తే జిల్లాకు మంచి పేరు తీసుకొస్తానని అన్నారు. 1996లో పవన విద్యుత్ మిషన్ విండ్ మిల్ తయారుచేసి రాష్ట్రపతి అవార్డుతో పాటు రూ. 25 వేల పురస్కారం అందుకున్నానని, 2012లో రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్‌లో పవన విద్యుత్ మిషన్ విండ్ మిల్ తయారు చేశానన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో గ్రామీణ శాస్త్రవేత్తలలో మొదటి శాస్త్రవేత్తగా పేరు వచ్చిందని అన్నారు. తాను చేసిన రెండు ఇన్నోవేషన్‌లకు పేటెంట్ రైట్స్ కూడా వచ్చాయని పేర్కొన్నారు.

### ముగిసిన జిల్లా స్థాయి పోటీలు



విజేతలతో టోర్నీ నిర్వాహకులు

**సిరికొండ:** మండలంలోని గడ్కోల్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. పార్టీ రాష్ట్ర సెక్రెటేరియట్ సభ్యుడు వి ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. యువత అవినీతి సమాజానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాయకులు వి రామకృష్ణ, దేవారం, ముత్తెన్న, గంగాధర్, సురేశ్, రమేశ్, దామోదర్, బాబన్న, సాయారెడ్డి, లింబాద్రి, రమేశ్, కిశోర్, అనీస్, కిరణ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 80,700 | వెండి(కిలో) | 95,500 |
| 22 క్యారెట్స్ | 74,460 | – నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు | డ్రెస్డ్ | 200 |
| | (కిలోకు) | లైవ్ | 160 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 6 | 10 | గాజరుగడ్డ | 40 | 60 |
| బెండకాయ | 40 | 80 | పచ్చిమిర్చి | 50 | 80 |
| బీరకాయ | 40 | 80 | దోసకాయ | 30 | 50 |
| దొండకాయ | 30 | 50 | ఆలుగడ్డ | 20 | 40 |
| బీర్నీసుకాయ | 40 | 60 | గోబిగడ్డ | 10 | 20 |
| కాకరకాయ | 30 | 50 | గోబిపువ్వు | 20 | 40 |
| వంకాయ | 30 | 50 | బీట్‌రూట్ | 30 | 50 |
| పాలకూర | 15 | 30 | కరివేపాకు | 60 | 100 |
| మెంతికూర | 20 | 40 | చామగడ్డ | 40 | 80 |
| కొత్తిమీర | 10 | 20 | గోరుచిక్కుడు | 40 | 80 |
| పుదీనా | 40 | 80 | చిక్కుడుకాయ | 40 | 80 |
| క్యాప్సికం | 40 | 60 | | | |

– సుభాష్‌నగర్

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.45,4.30,7.35, 10.20 |
| స్క్రీన్-2 | గేమ్‌ఛేంజర్ -1.10,7.35 10.35 డాకు మహారాజు(తెలుగు)-4.30 |
| స్క్రీన్-3 | డాకుమహారాజు(తెలుగు)-11.00, 7.35,10.30 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)- 10.10, 1.10, 4.10, 7.10, 10.10 |
| స్క్రీన్-2 | డాకు మహారాజు (తెలుగు)- 10.20, 1.25, 7.35, 10.40 ఎమర్జెన్సీ(హిందీ)-4.30 |
| స్క్రీన్-3 | గేమ్ ఛేంజర్(తెలుగు)- 12.00, 3.20, 6.40 ఎమర్జెన్సీ(హిందీ)-10.00 |
| స్క్రీన్ -4 | ఎమర్జెన్సీ(హిందీ)-12.00 ఆజాద్(హిందీ)-3.05, 10.15 పుష్ప-02(తెలుగు)-6.10 |
| లలితామహల్ | గేమ్ ఛేంజర్(తెలుగు) |
| దేవి | డాకు మహారాజు(తెలుగు) |
| నటరాజ్ | సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు) |
| విజయ్ | సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) |

# మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఆర్పీలు

**నిజామాబాద్ సిటీ:** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెప్మాలో విధులు నిర్వహిస్తున్న ఆర్పీలు మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. మెప్మా సీవోలు తమను అగౌరవంగా మాట్లాడుతున్నారని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ధర్నాలో ఆర్పీలు స్వర్ణలత, మంజుల, స్వప్న, రాజమణి, జ్యోతి, కళావతి, స్వర్ణ, లత, హరిత, ప్రమీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పల్లె గంగారెడ్డికి సన్మానం



**సిరికొండ:** జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని బీజేపీ కిసాన్ మోర్చా మండల నాయకులు గురువారం జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ధర్పల్లి బాబురావు, లింబాగౌడ్, బచ్చు మారుతి, కామని కిరణ్, వావిలాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



**సిరికొండ:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని హైదరాబాద్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి డీసీసీ కార్యదర్శి ఎర్రన్న బడాల మహిపాల్, రొండ్ల గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

# మాదిగలను చైతన్యం చేస్తాం



రథయాత్రలో మాట్లాడుతున్న వెంకటస్వామి

**నిజామాబాద్ అర్బన్:** వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల రథయాత్ర ద్వారా మాదిగలను చైతన్యం చేస్తామని రథయాత్ర ఇన్‌చార్జి వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తా నుంచి రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతుకలు.. లక్ష డప్పుల సాంస్కృతిక మహా ప్రదర్శనను మాదిగలు విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రమోద్, సరికెల పోశెట్టి, మహేందర్, సంతోష్, రాంపూర్ సాయి, భూమేశ్, నవీన్, మైలారం బాలు, ప్రభాకర్, మచ్చ దేవేందర్, అండె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి ప్రభుత్వ కృషి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

**బోధన్:** ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో పట్టణ, మండలాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే గురువారం పంపిణీ చేశారు. సబ్బండవర్గాల ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారంటీ స్కీంలను పూర్తి స్థాయిలో అమలుకు ప్రభుత్వం ముందుకెళ్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతున్న కాంగ్రెస్‌ను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. అనంతరం ఉర్దూఘర్‌ను సందర్శించారు. అక్కడ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశపరీక్షలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ విఠల్, టీపీసీసీ డెలిగేట్ బి గంగాశంకర్, కౌన్సిలర్లు శరత్ రెడ్డి ,శ్రీకాంత్ గౌడ్,దూప్ సింగ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

# పడకల్‌లో ఉచిత పశువైద్య శిబిరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

**జక్రాన్‌పల్లి:** మండలంలోని పడకల్‌లో గురువారం పశుసంవర్ధక, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ గంగాధరయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పశువులకు ఉచితంగా టీకాలు వేశారు. అనంతరం శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఏడీ మహమ్మద్ అబ్దుల్ మజీద్, మండల పశువైద్యాధికారిణి హర్షిత రెడ్డి, డిచ్‌పల్లి పశువైద్యాధికారి గోపికృష్ణ, సిబ్బంది పోశెట్టి, రాజ్‌కుమార్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.